సాక్షి
ఖమ్మం

గురువారం । 6 । జూలై । 2023



రూ.7లక్షలతో పొలాలకు రోడ్లు

వైరా మండలం వల్లాపురం రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు సొంత నిధులు రూ.7లక్షలతో రోడ్లు నిర్మించుకున్నారు. 8లో



సమ్మె బాటలో...

సమస్యల పరిష్కరించాలనే డిమాండ్‌తో గ్రామపంచాయతీల కార్మికులు గురువారం నుంచి సమ్మె బాట పడుతున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
29° / 25°

వాతావరణం

జిల్లా అంతటా గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఖమ్మం చేరుకోనున్న ఆయన 4, 45, 50, 53 డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు పూర్తయిన పనులను ప్రారంభిస్తారు. అలాగే, సాయంత్రం 4గంటలకు రఘునాథపాలెంలోని రైతు వేదికలో పోడు సాగుదారులకు పట్టాలు పంపిణీ చేస్తారు.

ఖమ్మం రీజియన్‌కు 20 మంది డ్రైవర్లు

ఖమ్మంమామిళ్లగూడెం: గతంలో టీఎస్‌ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో విధులు నిర్వర్తించి డిప్యూటేషన్‌పై గ్రేటర్ హైదరాబాద్ జోన్‌కు వెళ్లిన 20 మంది డ్రైవర్లను తిరిగి మాతృ రీజియన్‌కు కేటాయించారు. ఈమేరకు గ్రేటర్ హైదరాబాద్ జోన్ డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిని డిపో మేనేజర్లు తక్షణమే రిలీవ్ చేయాలని, ఆతర్వాత డ్రైవర్లు ఖమ్మంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో సూచించారు.

ఏజెన్సీలకు ఏఎన్‌ఎంల కేటాయింపు బాధ్యతలు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, కళాశాల, ప్రీ మెట్రిక్ వసతిగృహాల్లో ఏఎన్‌ఎంలను సమకూర్చేందుకు అర్హత కలిగిన ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల నుండి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమశాఖ అభివృద్ధి అధికారి పి.కృష్ణానాయక్ తెలిపారు. ఆసక్తి ఉన్న ఏజెన్సీ బాధ్యులు ఈనెల 12వ తేదీలోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో టెండర్ ఫారంలు తీసుకుని 14వ తేదీ లోగా అందజేయాలని సూచించారు. అనంతరం 15వ తేదీన టెండర్లు పరిశీలించి ఖరారు చేస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 94406 40070, 94905 20998 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన జేడీ



కళాశాలలో పరిశీలిస్తున్న జేడీ యాదగిరి

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను ఉన్నత విద్య జాయింట్ డైరెక్టర్ జి.యాదగిరి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, గ్రంథాలయం, ఈడీసీ, హెల్త్‌సెంటర్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అధ్యాపకులు, సిబ్బందితో సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ జి.పద్మావతితో పాటు వెంకటేశ్వర్లు, రాకేష్, పద్మారాణి, హదస్సారాణి, విద్యాప్రవీణ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పాలేరు పాత కాల్వకు కొత్త గేట్లు!



రిజర్వాయర్ నీటిలో మట్టితో వేసిన రింగ్ బండ్

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ పాత కాల్వ(చిన్న కాల్వ) గేట్ల మార్పుపై అధికారులు దృష్టి సారించారు. ఈమేరకు పనులకు ఆటంకం కలగకుండా బుధవారం గేట్ల సమీపాన మట్టితో రింగ్‌బండ్ వేశారు. ఇక గురువారం నుండి ప్రస్తుత గేట్లు తొలగించి కొత్తవి అమర్చే పనులు మొదలుపెడతారు. గేట్లు శిథిలావస్థకు చేరడంతో నీరు కాల్వలోకి వృథాగా పారడమే కాక గేట్లు ఎత్తి, దించే సమయాన ఇబ్బంది ఎదురవుతోంది. దీంతో కొత్తవి అమరుస్తున్నారు. ఈ పనులతో కాల్వకు నీటి విడుదల ఆలస్యం కానుంది. ప్రస్తుతం ఆయకట్టు రైతులు వరినార్లు పోయగా, చెరకు సాగు చేస్తున్నారు. ఈనేపథ్యాన త్వరగా పనులు పూర్తిచేయడంపై దృష్టి సారించాలనట్లు జల వనరుల శాఖ అధికారులు తెలిపారు.

సింగరేణి కార్మికుల నిరాహార దీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు అమలు చేయడంతో ఇతర సమస్యల పరిష్కారం కోసం కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం ఒకరోజు దీక్ష చేపట్టారు. కాగా, దీక్ష శిబిరాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సందర్శించి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే, వివిధ పార్టీ నాయకులు కూడా సంఘీభావం తెలిపారు.



చార్జింగ్ రెడీ!

- పెరుగుతున్న ఈవీలకు అనుగుణంగా చార్జింగ్ స్టేషన్లు
- జాతీయ, రాష్ట్రీయ రహదారుల వెంట ఏర్పాటుకు అవకాశం
- టూరిజం, సివిల్ సప్లయీస్ కేంద్రాలతో పాటు సబ్‌స్టేషన్ల వద్ద కూడా..
- జిల్లాలో 12 కేంద్రాల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియ మొదలు

నేలకొండపల్లి: పెట్రో ఉత్పత్తుల వాడకాన్ని తగ్గించడం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఈనేపథ్యాన అన్ని ద్విచక్ర వాహనాలతో పాటు కార్ల కంపెనీలు విద్యుత్‌తో నడిచే వాహనాలను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టగా ప్రజల నుంచి కూడా ఆదరణ లభిస్తోంది. అయితే, వాహనాల సంఖ్యకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో చార్జింగ్‌కు అవకాశాలు లేవు. ఫలితంగా ఇంట్లో తప్ప బయట చార్జింగ్‌కు సదుపాయం లేక.. ప్రయాణం అర్ధంతరంగా ఆగిపోతుందనే భయంతో పలువురు ఇంకా ఎలక్ట్రికల్ వాహనాల వైపు మొగ్గు చూపడం లేదు. ఈ నేపథ్యాన గ్రామీణ ప్రాంతాల్లో చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ సూచనలతో రంగంలోకి దిగిన టీఎస్ రెడ్కో అధికారులు ఎక్కడెక్కడ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటుచేయాలో ఇప్పటికే నిర్ణయించి టెండర్ల ప్రక్రియపై దృష్టి సారించారు.

ప్రధాన రహదారుల పక్కన

ఇప్పటికే జాతీయ రహదారుల వెంట ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్న చోట చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటుచేశారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మండల కేంద్రాల్లోనూ చార్జింగ్ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ స్థలాలు అనువుగా ఉండి జాతీయ, రాష్ట్ర రహదారులను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటుచేస్తారు. స్థల వివరాలతో టీఎస్ రెడ్కోకు దరఖాస్తు చేస్తే పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అనుమతులు, రాయితీలు ఇవ్వనున్నారు.

టూరిజం స్థలాల్లో కూడా...

ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో రహదారుల వెంటే కాకుండా టూరిజం స్థలాలు, సివిల్ సప్లయీస్ కేంద్రాలతో పాటు విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద కూడా ఈవీ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. భద్రాచలం, కొత్తగూడెంలోని టూరిజం స్థలాలు, కల్లూరులోని సివిల్ సప్లయీస్ కేంద్రం వద్ద స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇవేకాక రహదారి పక్కనే విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్న అశ్వారావుపేట, ఇల్లెందు, దమ్మపేట, గట్టుగూడెం తదితర చోట్ల కూడా ఈవీ చార్జింగ్ సెంటర్లు ఏర్పాటుచేయాలనే యోచనతో కార్యాచరణ మొదలుపెట్టారు.



నేలకొండపల్లిలో స్టేషన్‌కు కేటాయించిన ప్రభుత్వ స్థలం

జిల్లాలో ఎక్కడెక్కడ అంటే...

ఈవీ చార్జింగ్ స్టేషన్ల కోసం జిల్లాలోని 12 ప్రాంతాలను ఇప్పటికే గుర్తించారు. జాతీయ, రాష్ట్రీయ రహదారులకు ఇరువైపులా ప్రతీ 25 కి.మీ. దూరంలో ఒక్కో స్టేషన్‌కు ఏర్పాటుకు నిర్ణయించారు. ఈమేరకు నేలకొండపల్లి, ముదిగొండ, కూసుమంచి, జూజ్జుల్‌రావుపేట, ఖమ్మం రూరల్, వైరా, ఏన్కూర్, సత్తుపల్లి, పెనుబల్లి, ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, ఖానాపురంల్లో స్థలాలను ఎంపిక చేయగా, నిర్మాణానికి సంబంధించి టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది.

టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది..



ఖమ్మం ఉమ్మడి జిల్లాలో విద్యుత్ వాహనాల చార్జింగ్ కేంద్రాల విస్తరణకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో రహదారుల వెంట, టూరిజం, సివిల్ సప్లయీస్ కేంద్రాల్లో స్టేషన్ల ఏర్పాటు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ 25 కి.మీ.కు ఒక స్టేషన్ ఏర్పాటుచేసేలా టెండర్లు ఆహ్వానించాం.

– ఉమాకాంత్, టీఎస్ రెడ్కో మేనేజర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

వరుణుడి కటాక్షం

- జిల్లాలో సగటు వర్షపాతం 14.1 మి.మీ.లు
- ఊపిరి పోసుకుంటున్న పంటలు



ఖమ్మం బైపాస్ రోడ్‌లో బుధవారం కురుస్తున్న వర్షం

ఖమ్మంవ్యవసాయం: వరుణుడు జిల్లాను కరుణించాడు. దీంతో బుధవారం జిల్లావ్యాప్తంగా వానలు కురుస్తున్నాయి. జిల్లాలో సగటున 14.1 మి.మీ.ల వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా కారేపల్లి మండలంలో 111.2 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. మధిర, ఎర్రుపాలెం, వేంసూరు మండలాల్లో తప్ప అంతటా వర్ష ప్రభావం కనిపించింది.

రోజంతా ఎండ

జిల్లావ్యాప్తంగా బుధవారం రోజంతా ఉష్ణోగ్రతలు గరిష్టస్థాయిలోనే నమోదయ్యాయి. దీంతో ఉక్కపోతతో ప్రజలు అవస్థ పడ్డారు. ఇంతలోనే సాయంత్రం ఐదు గంటల తర్వాత వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. అధికారిక సమాచారం ప్రకారం మరో నాలుగు రోజుల పాటు ఆకాశం మేఘావృతమై ఉండి తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రధానంగా తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, సింగరేణి, ముదిగొండ, నేలకొండపల్లి, బోనకల్ మండలాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

గరిష్టంగా వర్షపాతం నమోదైన మండలాలు (మి.మీ.ల్లో)

మండలం	వర్షపాతం
కారేపల్లి	111.2
కామేపల్లి	58.2
ఏన్కూరు	33.6
తిరుమలాయపాలెం	19.4
రఘునాథపాలెం	10.4

పైర్లకు ప్రాణం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటలకు మేలు చేసే అవకాశం ఉంది. వర్షంపై ఆధారపడి జిల్లాలో దాదాపు 60 వేల ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటారు. మరో 1,500 ఎకరాల్లో పెసర వేయగా, 30 వేల ఎకరాలకు పైగా వరినార్లు పోశారు. ఇంకొన్ని చోట్ల నేరుగా వదజల్లే పద్ధతిలో పొడి దుక్కుల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఈ పంటలకు జీవం పోసినట్లవుతోంది. వర్షాలు ఇలాగే కొనసాగితే జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఏదిఏమైనా నెల రోజులుగా ఎదురుచూస్తున్న వర్షాలు మొదలుకావడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

వసతిగృహాల్లో మరమ్మతులు చేయించండి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో అవసరమైన మరమ్మతులు చేయించాలని వసతిగృహాల సంక్షేమ అధికారుల ఫోరం బాధ్యులు కోరారు. ఈమేరకు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ, డీబీసీడీఓ జి.జ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ పి.కృష్ణకు బుధవారం వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు కె.రుక్మారావు, ఎస్.నాగేశ్వరరావు, కోశాధికారి కె.తిరుపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వ భవనాలకు రంగులు వేయించడమే కాకుండా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నాలుగో తరగతి సిబ్బందిని కేటాయించాలన్నారు. అలాగే, వసతిగృహ సంక్షేమ అధికారుల సర్వీస్ సమస్యలు పరిష్కరించాలని, డైట్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. ఆతర్వాత ఎస్‌టీఓలో ఆగిన బిల్లులు విడుదల చేయాలని కోరుతూ ట్రెజరీ డీడీ వి.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. సీనియర్ సంక్షేమ అధికారి యూ.భారతిదేవి, ఫోరం బాధ్యులు కె.వీరభద్రరావు, కె.వెంకటేశ్వర్లు, పి.మాధురి, పి.హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ డీడీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

డెంగీ నివారణపై విస్తృత అవగాహన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ స్నేహలత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్, అధికారులు

- వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు
- జిల్లా వ్యాప్తంగా డ్రై డే తప్పనిసరి
- సన్నాహక సమావేశంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మం వైద్యవిభాగం: వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలే ప్రధానమని గుర్తించి డెంగీ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. టీటీడీసీ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ, అనుబంధ శాఖల అధికారులతో సీజనల్ వ్యాధుల నియంత్రణ, ముందస్తు చర్యలపై బుధవారం సన్నాహక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత మూడేళ్లలో అధికంగా కేసులు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పల్లె, బస్తీ దవాఖానాల వైద్యులు, సిబ్బందికి వ్యాధుల చికిత్సపై శిక్షణ ఇస్తే ప్రధాన ఆస్పత్రిపై ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు. అలాగే, మండల స్థాయిలోనూ వర్క్‌షాప్‌లు నిర్వహించి అవగాహన కల్పించాలని, పరీక్షల సంఖ్య పెంచడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టొచ్చని తెలిపారు. జిల్లాలో డ్రై డే తప్పనిసరిగా అమలుచేస్తూ ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. ఇంకా నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్, గంబూషియా చేప పిల్లలను వదలడంతో పాటు పారిశుధ్య పనులు విస్తృతం చేయాలని చెప్పారు. అనంతరం డబ్ల్యూహెచ్‌ఓ తెలంగాణ, ఏపీ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రకుమార్ సింగ్ పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేఎంసీ ఆధ్వర్యాన డ్రై డే, డెంగీ నివారణ చర్యలపై రూపొందించిన అవగాహన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ స్నేహలత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, డీఎంహెచ్‌ఓ బి.మాలతి, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ విద్యాచందన, జెడ్పీ సీఈఓ అప్పారావు, ఎస్సీ డీడీ కె.సత్యనారాయణ, బీసీడబ్ల్యూఓ జి.జ్యోతి, డీఈఓ సోమశేఖరశర్మ, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, జిల్లా సర్వైలెన్స్ అధికారి సైదులు, మత్స్య శాఖ అధికారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికే ప్రాధాన్యత

- వర్షాభావ పరిస్థితుల నేపథ్యాన నిర్ణయం
- జలాశయాల నుంచి సాగుకు నీరు వదలకుండా చర్యలు
- ఇదే సమయాన ప్రత్యామ్నాయాలపై అధికారుల దృష్టి
- బయ్యన్నవాగు నుండి పాలేరులోకి గోదావరి జలాలు

ఖమ్మంఅర్బన్: ఈ ఏడాది వానాకాలం ఆలస్యమవుతోంది. జూన్ ముగిసి జూలై వచ్చినా ఇంకా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. రెండు రోజులుగా అడపాదడపా వాన పడుతున్నా చెరువుల్లోకి నీరు చేరే పరిస్థితి కానరావడం లేదు. ఈ నేపథ్యాన ప్రాజెక్టులు, చెరువుల్లో నీరు అడుగంటుతుండడంతో అంతటా ఆందోళన నెలకొంది. సాగు పనులు మొదలుపెట్టలేక రైతులు ఎదురుచూస్తుండగా.. ఇంకొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే తాగునీటికి ఇక్కట్లు మొదలయ్యే ప్రమాదముంది. దీంతో అధికారులు ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించారు. తాజాగా హైదరాబాద్‌లో జరిగిన జలవనరుల శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల సమావేశంలో కూడా వానలు పడే వరకు తాగునీటి అవసరాలకు తప్ప సాగు కోసం నీరు విడుదల చేయొద్దనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.



పాలేరు రిజర్వాయర్‌లో అడుగంటిన నీరు

అడుగంటుతున్న జలాలు

జిల్లాలో దాదాపు అన్ని జలాశయాలు అడుగంటాయి. మొత్తంగా 983 చెరువులకు గాను 15 చెరువుల్లో మాత్రమే 75శాతానికి పైగా నీరు ఉంది. మిగతా అన్నింట్లో కనిష్టస్థాయికి నీటి నిల్వలు చేరాయి. పాలేరు రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 23 అడుగులకు గాను 12 అడుగుల నీరు ఉండగా, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి అవసరాలకు విడుదల చేస్తున్నారు. మరోపక్క వర్షాలు లేక, సాగర్ డ్యాం నుంచి నీరు విడుదలయ్యే పరిస్థితులు కూడా కానరావడం లేదు. దీంతో ఉన్న నీటిని పొదుపుగా తాగునీటి అవసరాలకే వినియోగించాలని నిర్ణయించారు. ఇక జిల్లాలో సాగర్ జలాల ద్వారా 17 మండలాల్లో 2.54 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. గత నెల వరకు వేసవి పంటలకు నీరు విడుదల చేయగా, ఆతర్వాత కాల్వలు మరమ్మతులు మొదలుపెట్టారు. ప్రస్తుతం జరుగుతున్న మరమ్మతులను త్వరగా పూర్తిచేయడంపై దృష్టి సారించిన అధికారులు... జిల్లాతో పాటు సాగర్ ఎగువన వర్షాలు కురిసి వరద వచ్చే వరకు సాగుకు వదలొద్దని ఉన్నత స్థాయి సమీక్షలో నిర్ణయించినట్లు సమాచారం.



బేతుపల్లి రిజర్వాయర్ వద్ద పరిశీలిస్తున్న అధికారులు

బయ్యన్న వాగు నుండి గోదావరి నీరు

సాగర్ జలాలు ఇప్పటికిప్పుడు వచ్చే అవకాశం లేకపోవడం.. పాలేరు రిజర్వాయర్ అడుగంటుతుండడంతో గోదావరి జలాలను బయ్యన్న వాగు(తల్లంపాడు బ్రాంచ్ కాల్వ) ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించడంపై దృష్టి సారించారు. తల్లంపాడు బ్రాంచి కాల్వ ద్వారా 520 క్యూసెక్కుల నీరు పారినా, కాల్వ చివరకు 150 క్యూసెక్కులకు మించి వచ్చే అవకాశం లేదని సమాచారం. దీంతో పాలేరు రిజర్వాయర్‌లోకి ఎంత నీరు వచ్చినా తాగునీటి అవసరాలకే వినియోగించాలనే భావనలో ఉన్నారు. మరోపక్క వరి నార్లు పోసుకుంటున్న రైతులు నీటి కోసం ఎదురుచూస్తున్న నేపథ్యాన అధికారులపై ఒత్తిడి వచ్చే అవకాశముందని సమాచారం.

నీటి లభ్యత ఇలా...

- జిల్లా వ్యాప్తంగా 983 చెరువులు ఉన్నాయి. ఇందులో 25శాతం లోపు మేర నీటి నిల్వలు 728 చెరువుల్లో ఉండగా.. 25నుండి 50శాతం లోపు 178 చెరువుల్లో నీరు ఉంది. ఇక 75నుండి 100శాతం వరకు కేవలం 15 చెరువుల్లో నీటి నిల్వ ఉందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి.
- పాలేరు రిజర్వాయర్‌లో 23 అడుగులకు గాను 12 అడుగులు, వైరా రిజర్వాయర్‌లో 18 అడుగులకు గాను 14 అడుగుల మేర నీరు ఉంది. ఇంకా లంకాసాగర్‌లో 16 అడుగులకు గాను ఐదు అడుగులు, బేతుపల్లిలో 16 అడుగులకు గాను 9, జాలిముడి ప్రాజెక్టులో 15 అడుగుల మేర నీరు ఉందని అధికారులు వెల్లడించారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు



ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఉన్నత స్థాయిలో సమీక్షలో చేసిన సూచనల మేరకు జిల్లాలో కాల్వల మరమ్మతు పనుల్లో వేగం పెంచాం. వర్షాలు పడే వరకు సాగు అవసరాలకు నీటి విడుదల ఉండదు. కేవలం తాగునీటి అవసరాల కోసమే నీరు నిల్వ చేస్తున్నాం. పాలేరుకు గోదావరి జలాలు తరలించే ప్రక్రియపై దృష్టి సారించాం.

– శంకర్‌నాయక్, సీఈ

డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న న్యాక్ బృందం

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలకు న్యాక్ బృందం బుధవారం వచ్చింది. రెండు రోజుల పరిశీలనలో భాగంగా తొలిరోజు త్రిసభ్య బృందం వివిధ విభాగాలను సందర్శించింది. కోర్సులు, ఉపాధి అవకాశాలు, మౌలిక వసతులను పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ జాకీరుల్లా తెలిపారు. బృందం చైర్మన్ ముంబైలోని డాక్టర్ హోమిబాబా స్టేట్ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వసంత్ హెలావి రెడ్డి, అస్సాం విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ ప్రొఫెసర్ నిరంజన్ రాయ్, తమిళనాడుకు చెందిన డాక్టర్ హావద్ మొహియుద్దీన్ కళాశాలలో పరిశీలించగా కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ తాటికొండ రమేష్ హాజరయ్యారు. ఈసందర్భంగా కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులతో సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. ఈక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రమాసత్యవతి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ బీ.వీ.రెడ్డి, జీవన్‌కుమార్, కేయూ ఈసీ సభ్యుడు డాక్టర్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కిష్టాపురం వాసికి డాక్టరేట్


హరిబాబు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన ఆరేపల్లి హరిబాబుకు కాకతీయ విశ్వవిద్యాలయం బుధవారం డాక్టరేట్ ప్రకటించింది. కేయూ చరిత్ర విభాగంలో సీనియర్ ఆచార్యులు కొకొండ విజయబాబు పర్యవేక్షణలో ఆయన 'కాకతీయుల కాలంలో శక్తి దేవతల ఆరాధన, ప్రజల విశ్వాసాలు–నమ్మకాలు' అంశంపై సమర్పించిన సిద్ధాంత వ్యాసానికి డాక్టరేట్ లభించింది. ఈసందర్భంగా హరిబాబును చరిత్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ టి.మనోహర్, ప్రొఫెసర్ కనకరత్నం, డాక్టర్ సదానందం తదితరులు అభినందించారు.

'బ్రహ్మగర్జన' విజయవంతానికి ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న సంఘాల ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: హైదరాబాద్‌లో ఈనెల 9న జరగనున్న 'బ్రహ్మగర్జన'ను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం ఖమ్మంలో అర్చక సంఘాలు, పురోహిత, బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యాన బైక్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సమాఖ్య జిల్లా కన్వీనర్ వనం కృష్ణవేణి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ ర్యాలీ కస్బాబజార్ ప్రభాత్ టాకీస్ రామాలయం నుంచి పాత మున్సిపల్ ఆఫీస్, పాత బస్టాండ్, మయూరి సెంటర్ వరకు సాగింది. ఆయా సంఘాల నాయకులు మార్తి ప్రసాద్, రామ్మోహన్‌శర్మ, సురవజుల వాసు, శ్రీధరశర్మ, ఆమంచి సురేష్‌శర్మ, కౌశికాచార్యులు, సన్నిదానం లక్ష్మీనారాయణశర్మ, దుర్భాకుల శశిశర్మ, శ్రీధర్, దుగ్గిరాల సత్యనారాయణశర్మ, వంగర్ సుగంధశర్మ పాల్గొన్నారు.

పథకం దుర్వినియోగంపై కేంద్ర మంత్రికి ఫిర్యాదు


కేంద్ర మంత్రి భానుప్రతాప్‌తో మాట్లాడుతున్న వీరభద్రం, నాయకులు

ఖమ్మంరూరల్: రాష్ట్రంలో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ దుర్వినియోగమవుతోందని... కేవలం బీఆర్ఎస్ నేతలకే రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తోందని బీజేపీ జిల్లా కార్యదర్శి నకిరికంటి వీరభద్రం ఆరోపించారు. ఈమేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి భానుప్రతాప్‌సింగ్‌కు ఫిర్యాదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు అర్హతలను పరిగణనలోకి తీసుకోకుండా బీఆర్ఎస్ నాయకులు చెప్పిన వారికే యూనిట్లు కేటాయిస్తున్నారని తెలిపారు. బీజేపీ నాయకులు సత్యవతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్దబోయిన నాగరాజు, ప్రభాకరచారి డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో ఆవరణలో బుధవారం సాయంత్రం ఈ విషయమై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్సీ కమిటీ ఏర్పాటు, పెండింగ్ డీఏలు, సీపీఎస్ రద్దు తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో శిరీషకు వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ బాధ్యులు వెంకటరమణ, విజయ, ప్రవీణ్, జయలక్ష్మి, రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మధిర: మధిరలోని రెడ్డి గార్డెన్స్ సమీపాన బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బోనకల్‌కు చెందిన సిసింద్రీ ద్విచక్ర వాహనంపై వెళ్తూ యూటర్న్ తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్ పైనుంచి జారిపడ్డాడు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలు కాగా, ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ, జ్యోతి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ఠ	కనిష్ఠ
మొక్కజొన్న	1,400	1,400
పెసలు	7,600	6,600
కందులు	9,500	9,400
మిర్చి	19,000	13,500
ఏసీ మిర్చి	24,650	18,500
పత్తి	7,000	5,600

– ఖమ్మం వ్యవసాయం

పెంపుడు జంతువులతో జాగ్రత్త

- వ్యాధులు సంక్రమించే ప్రమాదం

నేడు 'వరల్డ్ జూనోసిస్ డే'

భద్రాచలంఅర్బన్: కొందరు కాలక్షేపం, సరదాగా పెంపుడు జంతువులను పెంచుకుంటారు. వాటి నుంచి కూడా వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులను జూనోసిస్‌గా పేర్కొంటారు. వ్యాధులు సంక్రమించకుండా అవగాహన పెంపొందించుకోవడం, జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరం. నేడు వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

ఏయే వ్యాధులు సోకే ప్రమాదం ఉందంటే..

శాస్త్రవేత్తలు, వైద్యుల అంచనాల ప్రకారం జంతువుల నుంచి మనుషులకు దాదాపుగా 200 రకాల వ్యాధులు సోకుతాయి. పెంపుడు జంతువుల వల్ల పిల్లలకు ముప్పు ఎక్కువగా ఉంటుంది. కరోనా వైరస్ గబ్బిలాల నుంచి వ్యాపించినట్లు పేర్కొన్నా పూర్తిస్థాయి నిర్ధారణ జరగలేదు. పందుల ద్వారా మెదడువాపు వ్యాధి, కుక్కలద్వారా రేబిస్, గొర్రెలు, మేకలద్వారా ఆంత్రాక్స్, ఆవులు, గేదెల ద్వారా క్షయ, పాలద్వారా బ్రూసెల్లోసిస్ వ్యాపిస్తుంది. బ్రూసెల్లోసిస్ వల్ల కీళ్లనొప్పులు, జ్వరం ఉంటుండగా వ్యంధత్వం సంక్రమిస్తుంది. పక్షులవల్ల సిటాకోసిస్, ఎలుకలతో ప్లేగు, పిల్లుల ద్వారా పాగ్సోప్లాస్మోగ్రాండై, కోళ్లద్వారా బర్డ్‌ఫ్లూ, కుందేళ్ల ద్వారా టాక్సోప్లాస్మోసిస్, కోతుల ద్వారా లెప్రసీ, ఇతరత్రా జంతువులు, పక్షుల ద్వారా చర్మ, శ్వాస సంబంధిత వ్యాధులు మనుషులకు వ్యాపిస్తాయి. రేబిస్ సోకిన కుక్కలను ముట్టుకున్నా, ముద్దుచేసినా వ్యాధి అంటుకుంటుంది. వ్యాధులు సోకిన కోళ్లు, గొర్రెలు, జంతువులు, పశువుల మాంసం తిన్నా కూడా మనుషులకు వ్యాధులు వ్యాపిస్తాయి. కుక్కలు తదితరాల మలమూత్రాల వల్ల కూడా వ్యాధులు సంక్రమిస్తాయి. కుక్కలు, పిల్లులను ఒడిలో, సోఫాల్లో, మంచాల్లో కూర్చుండబెట్టినపుడు దుస్తులద్వారా బ్యాక్టీరియా, వైరస్ వ్యాపిస్తుంది. అన్ని వ్యాధుల్లోనూ రేబిస్ అత్యంత ప్రమాదకరం. పిచ్చికుక్కలు మనుషులను, గేదెలను కరవటం పరిపాటిగా మారగా వీటిని నిర్మూలించేలా, వీధికుక్కలకు సైతం వ్యాక్సినేషన్ చేయాలి.

ఇవి పాటించాలి

జంతువులు, పక్షులవల్ల వైరస్, బ్యాక్టీరియా, పరాన్న జీవులు పరిసరాల్లోకి వ్యాపించి మానవుల్లో వ్యాధులకు కారణమవుతాయి. ఇటీవల కుక్కలను పెంచటం ఎక్కువైంది. పెంపుడు జంతువులున్నపుడు ఇంటి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలి. కుక్కలను ఉంచే గదులు, కట్టివేసే ప్రాంతాలను కూడా శుభ్రంగా ఉంచాలి. పిల్లలు కుక్కలతో ఆడుకున్న వెంటనే స్నానం చేయించాలి లేదా చేతులను శుభ్రంగా కడగాలి. జంతువులు తిన్న ఆహార పదార్థాలను చిన్నపిల్లలు తినకుండా చూడాలి. జంతువులను ముట్టుకున్న తర్వాత పిల్లలు చేతులను నోట్లో పెట్టుకోకుండా చూడాలి. మనం తినే పదార్థాలను కుక్కలు, పిల్లులు తినకుండా చూడాలి. మనం తినే పళ్లేల్లోనూ అవి మూతి పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పెంపుడు కుక్కలకు ప్రతి 6 మాసాలకోసారి తప్పనిసరిగా టీకాలను వేయించాలి. జబ్బుపడిన పశువుల పాలను తాగకూడదు. రోజూ మనం తాగే పాలను తప్పనిసరిగా మరిగించాలి. పశువైద్యులు, సిబ్బందిని సంప్రదించి వ్యాక్సినేషన్, వ్యాధుల నివారణ తదితరాలు వివరాలు తెలుసుకుని జూనోసిస్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

జూనోసిస్ డే..

ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్‌పాశ్చర్ మొదటిసారిగా 1885, జూలై 6న పిచ్చికుక్క కాటుకు గురైన బాలుడికి నిరోధక టీకా ఇవ్వడం ద్వారా రేబిస్ వ్యాధి రాకుండా కాపాడగలిగాడు. దీంతో అప్పటి నుంచి ఏటా జూలై 6న జూనోసిస్ దినోత్సవం నిర్వహిస్తున్నారు.



భద్రాచలం పశువుల ఆస్పత్రిలో పెంపుడు కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది (ఫైల్)

డీవార్మింగ్ చేయిస్తాం



మా ఇంట్లో రోటో అనే లాబ్రడర్ కుక్క ఉంది. దాని వయసు 11 ఏళ్లు. ఆరు నెలలకోసారి పశువైద్యులను సంప్రదించి డీవార్మింగ్ చేయిస్తాం. వీధి కుక్కలకు ఇలాంటిది లేకుండా బాగానే ఉంటాయి. మా వరకైతే తగిన జాగ్రత్తలు తీసుకుంటాం.

– పాకాల దుర్గాప్రసాద్, జంతు ప్రేమికుడు, భద్రాచలం

వ్యాక్సినేషన్‌పై నిర్లక్ష్యం వద్దు



ఇంట్లో పెంచుకునే జంతువులకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలి. లేకపోతే జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉంది. ఈ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే రెగ్యులర్ వెటర్నరీ వైద్యుల సలహాలు తీసుకోవాలి.

– డాక్టర్ రవీంద్రనాథ్, భద్రాచలం ఇన్‌చార్జి ఏడీప

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, పక్కన నాయకులు

వైరా: అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేలా యూత్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. వైరాలో బుధవారం నియోజకవర్గ బూత్ జోడో, యూత్ జోడో సమావేశాన్ని యూత్ అధ్యక్షుడు పమ్మి అశోక్ అధ్యక్షతన నిర్వహించగా దుర్గాప్రసాద్ మాట్లాడారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే కాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మాలోత్ రాందాస్‌నాయక్, యండ్రాతి సాయిరోహిత్, పతంగి నగేష్, తోటకూర గోపి, శంకర్‌నాయక్, వెంకటి, నవీన్, వీరబాబు, సాయి, నాగరాజు, ఎస్.వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, బొడ్డు బొందయ్య, శేఖర్‌గౌడ్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.ఏడు లక్షలతో పొలాలకు రోడ్లు

సొంతంగా నిర్మించుకున్న వల్లాపురం రైతులు



గ్రావెల్‌తో నిర్మించుకున్న రోడ్డుపై రైతులు

వైరారూరల్: మండలంలోని వల్లాపురం రైతులు దాదాపు రూ.7 లక్షల వ్యయంతో స్వచ్ఛందంగా పంట పొలాలకు వెళ్లేందుకు రోడ్లు నిర్మించుకున్నారు. దశాబ్దాలుగా పొలాలకు వెళ్లేందుకు రోడ్లు లేక ఇబ్బంది పడుతుండగా.. పొలాల మీదుగా రాకపోకలు సాగించే క్రమంలో వివాదాలు తలెత్తుతున్నాయి. దీంతో ఇద్దరు సన్నకారు రైతుల నుంచి 12 కుంటల భూమి కొనుగోలు చేసిన స్థానిక రైతులు ఆ భూమిలో నుంచి ఏడు మీటర్ల వెడల్పుతో గ్రావెల్ రోడ్డు నిర్మించారు. బోనకల్ మండలం పెద్ద బీరవల్లి రెవెన్యూ పరిధి వెంకటేశ్వర చెరువు కింద వల్లాపురం రైతులకు చెందిన దాదాపు 250 నుంచి 300 ఎకరాలు భూములు ఉన్నాయి. ఈ భూములకు వెళ్లి రావడానికి రహదారి లేకపోవడంతో వెంకటేశ్వర చెరువు వరకు రెండు పర్లాంగుల దూరం కొత్తగా రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు నుంచి లింక్ రోడ్లను కూడా వేయించారు. ఇందుకోసం రైతులు ఎకరానికి రూ.2వేల నుంచి రూ.5వేల వరకు సమకూర్చగా మొత్తం రూ.7లక్షలతో రోడ్లు వేయించడమే కాక పంట కాల్వలు, వాగుల వద్ద సిమెంట్ తూములు సైతం నిర్మించుకున్నారు. గ్రావెల్‌తో రోడ్లు తామే నిర్మించుకున్నందున ప్రభుత్వం పక్కా రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

మొలకెత్తని వరి విత్తనాలు

కూసుమంచి: నాసిరకం విత్తనాల కారణంగానే వరి నారు మొలకెత్తలేదని మండలంలోని హట్యాతండాకు చెందిన రైతు శంకర్ ఆరోపించారు. వారం క్రితం ఆయన కూసుమంచిలో వరి విత్తనాలు కొనుగోలు చేసి నారు పోశాడు. అయితే, బుధవారం వరకు మొలకెత్తకపోవడంతో ఏఓకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఏఓ వాణిని వివరణ కోరగా విచారణ జరిపి విత్తనలోపం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుని రైతుకు న్యాయం చేస్తామని తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


నాగేశ్వరరావు (ఫైల్)

కారేపల్లి: తాటి మొద్దులను ట్రాక్టర్‌తో తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని విశ్వనాథపల్లికి చెందిన రైతు తాతా నాగేశ్వరరావు(54) గతనెల 12వ తేదీన తన చేనులోని తాటి మొద్దులను ట్రాక్టర్ గొర్రు సెట్‌పై కట్టుకుని పక్కకు తొలగిస్తున్నాడు. ఇంతలోనే తాటి మొద్దులను కిందికి దించే క్రమాన ఆయనపై మొద్దు పడడంతో తీవ్రంగా గాయపడగా ఖమ్మంకు, అక్కడి నుంచి హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. నాగేశ్వరరావుకు భార్య కాంతమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సమాచారం అందుకున్న జెడ్పీటీసీ వాంకుడోతు జగన్, సర్పంచ్ ఇందిరాజ్యోతితో పాటు ఉన్నం వీరేందర్, ముత్యాల సత్యనారాయణ, భాగం మాధవరావు, వడ్డె అజయ్‌బాబు, రేగళ్ల మంగయ్య, వల్లభనేని మురళి, పాటి రంగయ్య, సూరపురెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, దమ్మాలపాటి రాంబాబు, పాటి కృష్ణయ్య, భాగం వెంకటేశ్వర్లు, దుద్దుకూరి వెంకట్ తదితరులు మృతుడి కుటుంబీకులు, సోదరుడు వెంకన్నను పరామర్శించారు.

చికిత్స పొందుతున్న యువకుడు...

ఖమ్మంక్రైం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఖమ్మం వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం... వైరా మండలం నారపునేనిపల్లికి చెందిన వెంపటి ఉదయ్ భాస్కర్(24) ఖమ్మం అద్దంకి వారి వీధిలో అద్దెకు ఉంటూ బేకరీలో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో ఆయన ఇటీవల పురుగుల మందు తాగగా ఇంటి యజమాని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతున్న ఉదయ్ బుధవారం మృతి చెందాడని పోలీసులు వెల్లడించారు.

పాము కాటుతో వృద్ధుడు...


సాంబశివరెడ్డి (ఫైల్)

సత్తుపల్లిరూరల్: పాము కాటుకు గురై ఓ వృద్ధుడు మృతి చెందాడు. మండలంలోని సదాశివునిపేటకు చెందిన మందపాటి సాంబశివరెడ్డి (70) ఇంటి వెనుక పెరడులో బుధవారం చెత్త తొలగిస్తుండగా పాటు కాటు చేసింది. దీంతో ఆయన కేకలు వేస్తుండగా కుటుంబీకులు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఈమేరకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఫోన్‌లో ఆయన కుటుంబీకులను పరామర్శించగా సర్పంచ్ తుంబూరు సరస్వతి, దామోదర్‌రెడ్డి, ఉపసర్పంచ్ కాలినేని వెంకటేశ్వరరావు తదితరులు సాంబశివరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు.

చెల్లని చెక్కు కేసులో మూడు నెలల జైలు శిక్ష

ఖమ్మంలీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో ఖమ్మంకు చెందిన వ్యక్తికి మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం మూడో అదనపు ప్రథమ న్యాయ శ్రేణి కోర్టు న్యాయమూర్తి వినుకొండ మాధవి బుధవారం తీర్పు చెప్పారు. వివరాలు.. ఖమ్మంకు చెందిన కె.రామస్వామి వద్ద వి.బాలమణి 2016 సెప్టెంబర్ 1న రూ.6,75,000 అప్పుగా తీసుకున్నాడు. ఆతర్వాత 2018 జులై 11న రూ.9,64,350కు చెక్కు ఇవ్వగా ఖాతాలో నగదు నిల్వ లేకపోవడంతో బౌన్స్ అయింది. దీంతో న్యాయవాది అమరనాథ్ ద్వారా రామస్వామి లీగల్ నోటీసు జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం నిందితుడికి మూడు నెలల జైలు విధించడమే కాక ఫిర్యాదికి రూ.9,64,350 చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

102లో ఉద్యోగాలకు రాతపరీక్ష, ఫిజికల్ టెస్ట్


నేలపై కూర్చుని పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

భద్రాచలం అర్బన్ : 102 అమ్మ ఒడి అంబులెన్సులో డ్రైవర్ ఉద్యోగాల కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రిలోని 108 కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 36 మంది హాజరుకాగా ట్రాఫిక్ నిబంధనలపై రాతపరీక్షతో పాటు ఉత్తీర్ణత సాధించిన ఇరవై మందికి ఫిజికల్ టెస్ట్ నిర్వహించగా ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సాయికిరణ్ పర్యవేక్షించారు. కాగా, అభ్యర్థులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో నేలపైనే కూర్చుని పరీక్ష రాయాల్సి వచ్చింది.

స్టడీ టూర్‌లో జిల్లా ప్రజాప్రతినిధులు


స్టడీ టూర్‌కు వెళ్లిన ప్రజాపతినిధులు, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఆహ్వానం మేరకు ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు స్టడీ టూర్‌లో భాగంగా న్యూఢిల్లీ వెళ్లారు. ఎంపీని బుధవారం అక్కడ కలిసిన వారు విజ్ఞానవిహార యాత్రలో భాగంగా న్యూఢిల్లీలో పలు చారిత్రక ప్రదేశాలను సందర్శిస్తారు. ఈ యాత్రలో జెడ్పీటీసీలు ఇంటూరి బేబి, యండపల్లి వరప్రసాద్, మరికంటి ధనలక్ష్మి, మాలోతు ప్రియాంక, పర్సగాని తిరుపతికిషోర్, పసుపులేటి దుర్గ, ఎంపీపీలు బెల్లం ఉమతో పాటు నేతలు ఇంటూరి శేఖర్, బెల్లం వేణుగోపాల్, యండపల్లి సింధు, మరికంటి రేనుబాబు, మాలోత్ రాజా, పెంట్యాల పుల్లయ్య, రావూరి శ్రీనివాసరావు, పల్లపోతు వెంకటేశ్వరరావు, పసుపులేటి వెంకటేశ్వర్లు, చేబ్రోలు మల్లికార్జునరావు, పంబి సాంబశివరావు, వాచేపల్లి లక్ష్మారెడ్డి, వేముల వీరయ్య, వీరన్న, గూడ సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లా కనెక్షన్ కోసం ఫోరమ్‌లో కేసు, విజయం

కొణిజర్ల: నల్లా కనెక్షన్ విషయమై వినియోగదారుల ఫోరంను ఆశ్రయించిన వ్యక్తి విజయం సాధించాడు. కొణిజర్లకు చెందిన పి.అప్పారావు నల్లా కనెక్షన్ పెట్టించుకోగా పంచాయతీ అనుమతి లేదంటూ తొలగించారు. దీంతో అప్పారావు మండల, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన రాలేదు. చివరకు జిల్లా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించగా, ఫోరం ఆదేశాల మేరకు మంగళవారం పంచాయతీ సిబ్బంది కనెక్షన్‌ను పునరుద్ధరించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ


ఘటనాస్థలంలో లారీలు

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీ మరో లారీని ఢీకొట్టింది. మండలంలోని హట్యాతండా సమీపంలో బుధవారం తెల్ల వారుజామున ఆగి ఉన్న లారీని సూర్యాపేట వైపు వెళ్తున్న మరో లారీ వెనుక నుండి ఢీకొట్టగా ముందు లారీ డివైడర్ పైకి ఎక్కి నిలిచిపోయింది. అయితే, ఢీకొట్టిన లారీ ముందు భాగం నుజ్జునుజ్జు కాగా డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడ్డారు. హైవే సిబ్బంది లారీలను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అంతర్జాతీయ క్రీడాకారుడికి చేయూత


అఖిల్‌ను సన్మానిస్తున్న జిల్లా జడ్జి, తదితరులు

ఖమ్మంలీగల్: వైరా మండలం కొస్తాలకు చెందిన సెయిలింగ్ క్రీడాకారుడు పిల్లి అఖిల్ ఇటీవల జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఈమేరకు ఆయన మెరుగైన శిక్షన పొందేలా బుధవారం ఖమ్మం బార్ అసోసియేషన్ బాధ్యులు రూ.50వేల నగదు పురస్కారాన్ని జిల్లా జడ్జి బీఎస్.జగ్జీవన్‌కుమార్ చేతుల మఅదుగా అందేశారు. న్యాయవాది మందడపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మం కోర్టులో మహిళా న్యాయవాదుల గదికి న్యాయవాది వడ్డెల్లి కృష్ణమూర్తి సమకూర్చిన టీవీని జిల్లా జడ్జి జగ్జీవన్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు అందజేశారు. అసోసియేషన్ మహిళా ప్రతినిధి కేవీవీ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే గొడవలు

కార్యకర్తలను పరామర్శించిన ఎమ్మెల్సీలు


కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీలు పల్లా, తాతా మధు

ఖమ్మం వైరారోడ్: రాజకీయ లబ్ధి కోసమే ప్రశాంతంగా ఉన్న కామేపల్లి మండలం పండితాపురంలో గొడవలు సృష్టిస్తున్నారని ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తాతా మధుసూదన్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య జరిగిన గొడవలో గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్తలు హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతుండగా బుధవారం వారు పరామర్శించారు. ఘటనకు కారకులైన కాంగ్రెస్ నాయకులపై చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. బీఆర్ఎస్ కామేపల్లి మండల అధ్యక్షుడు ధనియాకుల హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యాన లైసెన్స్ మేళా


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: ద్విచక్ర వాహనాలు, కార్ల డ్రైవింగ్ లైసెన్సు లేని 18 ఏళ్లు నిండిన వారి కోసం పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యాన మేళా నిర్వహిస్తున్నట్లు మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. లెర్నింగ్ లైసెన్సులు ఇప్పించేందుకు ఈ మేళా ఏర్పాటుచేస్తుండగా, దరఖాస్తు ఫీజు ఫౌండేషన్ తరఫున చెల్లిస్తామని వెల్లడించారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆమె సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, డీటీఓ కిషన్‌రావుతో కలిసి మాట్లాడారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా మీ సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, ఈనెల 7నుండి 11 వరకు ఖమ్మంలోని 57(1, 59, 60 మినహా) డివిజన్ల యువతీ, యువకులు, ఈనెల 12 నుంచి 23వ తేదీ వరకు రఘునాథపాలెం మండలంలోని యువత స్లాట్ బుకింగ్‌కు రావొచ్చని తెలిపారు. డివిజన్ల వారీగా కార్పొరేటర్లు సూచించిన తేదీన వచ్చి స్లాట్ బుక్ చేసుకుంటే, నిర్దేశిత తేదీన ఆర్టీఓ కార్యాలయంలో పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని చెప్పారు. చిరునామా కోసం ఆధార్, ఓటర్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్, పాస్ పోర్ట్‌ల్లో ఒకటి, పుట్టిన తేదీ ధ్రువీకరణ కోసం పదో తరగతి మెమో, పాన్‌కార్డు, పాస్ పోర్ట్‌ల్లో ఒకటి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్టీఓ మెంబర్ వల్లభనేని రామారావు, ఎంవీఐ వరప్రసాద్, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, వీరూనాయక్ పాల్గొన్నారు.

మధిర ఎక్సైజ్ సీఐగా ప్రసాద్‌గౌడ్

మధిర: మధిర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.నాగేశ్వరరావు బదిలీ అయ్యారు. ఈమేరకు ఆయనను కరీంనగర్‌కు బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే, నాగేశ్వరరావు స్థానంలో ప్రసాద్ గౌడ్ నియమిస్తూ ఎక్సైజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, నాగేశ్వరరావు మధిర ఎక్సైజ్ సీఐగా సుమారు ఆరేళ్ల పాటు విధులు నిర్వర్తించారు.

రేపు రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు

కొత్తగూడెంఅర్బన్: సౌత్ సెంట్రల్ రైల్వే భద్రాచలం రోడ్ బ్రాంచ్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు ఈ నెల 7న జరగనున్నాయి. ఎన్నికల్లో ఎంప్లాయీస్ సంఘ్, మజ్దూర్ యూనియన్, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయీస్ అసోసియేషన్ తలపడుతున్నాయి. ఇప్పటికే నాయకులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించగా, శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది.



అమరుల స్మారకానికి మరిన్ని మెరుగులు

త్వరలో దుబాయ్ నుంచి రానున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: ఇటీవలే కొత్తగా ప్రారంభమైన తెలంగాణ అమరవీరుల స్మారకానికి మరిన్ని మెరుగులు దిద్దేందుకు దుబాయ్ నుంచి త్వరలో నిపుణులు రాబోతున్నారు. ప్రధాన కాంక్రీట్ నిర్మాణం తర్వాత బయటి భాగాన్ని ప్రత్యేక జర్మన్ తయారీ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో రూపొందించిన విషయం తెలిసిందే. స్టీల్ షీట్లను ప్రత్యేక పద్ధతిలో అతికించి రూపొందించారు. ఇందుకు ఆధునిక పరిజ్ఞానాన్ని వాడి అతుకులు కనిపించకుండా, మొత్తం ఒకే స్టీలు రేకుతో రూపొందించినట్టుగా మార్చారు. భవనాన్ని ప్రారంభించే హడావుడిలో ఈ అతుకులను జాయింట్ చేసే పని పూర్తిస్థాయిలో చేయలేదు. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో అతుకులు కనిపిస్తున్నాయి. వాటిని సరిచేయించాలని నిర్ణయించారు. ఇందుకోసం దుబాయ్ నుంచి నిపుణులు రాబోతున్నారు.

దుబాయ్ నుంచే ఎందుకు?

ఈ ప్రత్యేక స్టెయిన్‌లెస్ స్టీల్‌ను జర్మనీ కంపెనీ నుంచి కొన్నారు. కానీ, దాన్ని ప్రీకాస్ట్ చేసే పని దుబాయ్ కంపెనీకి అప్పగించారు. ఆ పరిజ్ఞానం స్థానికంగా లేకపోవటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దుబాయ్‌లో ప్రీకాస్ట్ చేసిన తర్వాత, వాటిని ముక్కలు చేసి హైదరాబాద్‌కు తెచ్చి అప్పట్లో బిగించారు. ఇప్పుడు అతుకులు కనిపించకుండా చేయటం, సొట్టలు పూడ్చటం కూడా స్థానిక నిపుణులు చేయలేనందున దుబాయ్ నుంచి పిలిపిస్తున్నారు.

నిర్వహణ బాధ్యత పురపాలక శాఖకు..

తెలంగాణ అమరవీరుల స్మారక భవనం నిర్వహణ బాధ్యతను పురపాలక శాఖకు అప్పగిస్తున్నారు. ఈ మేరకు రోడ్లు భవనాల శాఖ లేఖ రాసింది. నిర్మాణం, తదనంతర పనులు పూర్తవుతున్నందున నిర్వహణ బాధ్యత తీసుకోవాల్సిందిగా అందులో సూచించింది. గతంలో ఆ ప్రాంగణంలో ఉన్న లుంబినీ పార్కును హెచ్‌ఎండీఏ నిర్వహించింది. ఇప్పుడు దీని నిర్వహణ కూడా ఆ సంస్థకే అప్పగించనున్నారు. భవిష్యత్తులో మళ్లీ మరమ్మతులు చేయాల్సి వస్తే తాము చూస్తామని అ లేఖలో పేర్కొన్నారు. ఇక, ఎన్టీఆర్ గార్డెన్స్ పక్కన ఏర్పాటు చేసిన అంబేడ్కర్ భారీ విగ్రహ నిర్వహణ బాధ్యత చూడాల్సిందిగా ఎస్సీ అభివృద్ధి శాఖకు మరో లేఖ రాశారు. దాని వ్యయాన్ని ఆ శాఖనే భరించినందున నిర్వహణ కోసం లేఖ రాశారు.

త్వరితగతిన పోలవరం

పూర్తయ్యేలా చూడాలని ప్రధాని మోదీకి సీఎం జగన్ వినతి

- రూ.55,548.87 కోట్లకు ఆమోదించండి
- తొలి దశ నిర్మాణానికి రూ.17,144 కోట్లు..
- వైఎస్సార్ జిల్లాలో స్టీల్ ప్లాంట్‌కు గనుల కేటాయింపు..
- నూతన వైద్య కళాశాలలకు సహకారం
- రాష్ట్రాభివృద్ధికి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని వినతి
- హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌తోనూ సమావేశం



కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి విభజన హామీలు సహా అపరిష్కృతంగా ఉన్న అంశాలపై దృష్టి పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు, జాతీయ ఆహార భద్రత చట్టం అమల్లో హేతుబద్ధత, విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలు, నూతన వైద్య కళాశాలలకు ఆర్థిక సాయం తదితర అంశాలపై ప్రధానితో సుమారు గంటా ఇరవై నిమిషాలపాటు సుదీర్ఘంగా చర్చించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని విన్నవించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక హోదా ఎంతో దోహద పడుతుందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.55,548.87 కోట్లకు ఆమోదం తెలపాలని, సుదీర్ఘ కాలంగా ఇది పెండింగ్‌లో ఉందని ప్రధాని నరేంద్రమోదీకి గుర్తు చేశారు. ప్రాజెక్టు పనులు వేగవంతం చేయడానికి తొలి దశ నిర్మాణానికి రూ.17,144 కోట్లు అవసరం అవుతుందని, ఇది కేంద్ర జల శక్తి శాఖ పరిశీలనలో ఉందని వివరించారు. తొలి దశ నిర్మాణానికి, కేంద్ర ఆర్థిక శాఖ ఇప్పటికే రూ.1,2911.15 కోట్ల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, అయితే తొలి దశలో భాగంగా మరో 36 గ్రామాల్లోని నిర్వాసితులకు సహాయ, పునరావాసం ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఇది ఇస్తేనే తొలి దశ పూర్తవుతుందని వివరించారు. మొత్తంగా పోలవరం తొలి దశ నిర్మాణానికి రూ.17,144 కోట్లు ఇచ్చేలా జల శక్తి శాఖకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన తన సొంత నిధులు రూ.1,310.15 కోట్లను వెంటనే రీయింబర్స్ చేయాలని, ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి ఆయా అంశాలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా ప్రధాని దృష్టికి సీఎం తీసుకెళ్లిన అంశాల వివరాలు ఇలా ఉన్నాయి.

సుదీర్ఘ కాలంగా బకాయిలు

- 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకు తెలంగాణ రాష్ట్రానికి సరఫరా చేసిన విద్యుత్తుకు సంబంధించి ఏపీకి రావాల్సిన రూ.7,230.14 కోట్ల బకాయిలు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. ఏపీ జెన్‌కో ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా అవి త్వరగా వచ్చేలా చూడాలి.
- జాతీయ ఆహార భద్రతా చట్టం అమల్లో హేతుబద్ధత లోపించడంతో ఏపీ కన్నా ఆర్థికంగా ముందు వరుసలో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలకు అధిక శాతం కవరేజీ ఉంది. ఈ పథకం అమలుకు ఎంచుకున్న ప్రమాణాల్లో హేతుబద్ధత లేదని నీతి ఆయోగ్ కూడా నిర్ధారించింది.
- హేతుబద్ధత లేనందున రాష్ట్రంలో 56 లక్షల కుటుంబాలకు కేంద్రం రేషన్ దక్కడం లేదు. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై ఏటా రూ.5,527 కోట్ల భారం పడుతోంది. ప్రతినెలా వినియోగించకుండా దాదాపు లక్ష టన్నుల బియ్యం కేంద్రం వద్ద ఉంటున్నాయి. ఇందులో 77 వేల టన్నులు రాష్ట్రానికి ఇస్తే సరిపోతుంది. దీనిపై మీరు (ప్రధాని) సత్వరమే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.
- ఏపీ పౌర సరఫరాల శాఖకు దీర్ఘకాలంగా (2012–13 నుంచి 2017–18 వరకు) పెండింగులో ఉన్న సబ్సిడీ బకాయిలు రూ.1,702.90 కోట్లను మంజూరు చేయాలి.

విభజన హామీలు నెరవేర్చండి

- రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రత్యేక హోదా సహా పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలి. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక హోదా దోహద పడటం ద్వారా రాష్ట్రం స్వయం సమృద్ధి దిశగా ముందుకు అడుగులు వేస్తుంది. అందువల్ల ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలి.
- వైఎస్సార్ జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర విభజన సందర్భంలో కేంద్రం హామీ ఇచ్చింది. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో జీవనోపాధి మెరుగుపడడానికి, జీవన ప్రమాణాలు పెంచడానికి ఈ ప్రాజెక్టు చాలా అవసరం. స్టీల్ ప్లాంట్‌కు అత్యంత అవసరమైన ముడి ఖనిజం కోసం మూడు గనులను ఏపీఎండీసీకి కేటాయించేలా కేంద్ర గనుల శాఖకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నాం.
- రాష్ట్రంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేశాం. ప్రతి జిల్లాకు కనీసంగా 18 లక్షల జనాభా ఉంది. ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు గతంలో ఉన్న 11 మెడికల్ కాలేజీలకు తోడు అదనంగా మరో 17 కళాశాలల నిర్మాణాలు చేపట్టాం. వీటికి తగిన ఆర్థిక సహాయం చేయాలి.
- సీఎం వైఎస్ జగన్.. ప్రధానితో భేటీకి ముందు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో సుమారు 45 నిమిషాలపాటు, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో పలు అంశాలపై చర్చించి, రాష్ట్రానికి సహకరించాలని కోరారు. కాగా, ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలో సీఎంకు వైఎస్సార్‌సీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, రెడ్డెప్ప, ఆర్.కృష్ణయ్య, తలారి రంగయ్య, చింతా అనూరాధ తదితరులు ఘన స్వాగతం పలికారు. బుధవారం రాత్రి పర్యటన ముగించుకుని తిరిగి తాడేపల్లికి బయల్దేరారు.

నిరుపేదలకు భూమి

పదేళ్ల తర్వాత ఏపీలో పంపిణీకి సన్నాహాలు

సాక్షి, అమరావతి: సుదీర్ఘకాలం తర్వాత ఏపీలో నిరుపేదలకు వైఎస్ జగన్ ప్రభుత్వం వ్యవసాయ భూములు పంపిణీ చేయనుంది. 23 జిల్లాల్లో 54 వేల ఎకరాలను అర్హులైన పేదలకు పంచేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల్లో అర్హులైన సుమారు 47 వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఆయా జిల్లాల అసైన్‌మెంట్ కమిటీల ఆమోదం కూడా దాదాపు పూర్తయింది. భూమి లభ్యతను బట్టి ఒక్కో లబ్ధిదారునికి ఒకటి నుంచి ఒకటిన్నర ఎకరం వరకు భూమి ఇవ్వనున్నారు. గ్రామాల్లో నిరుపేదలకు వ్యవసాయ భూములు ఇవ్వాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ ఏడాది కిందటే కసరత్తు మొదలుపెట్టారు. అన్ని జిల్లాల్లో పేదలకు ఇవ్వడానికి అందుబాటులో ఉన్న భూమి, అర్హులైన లబ్ధిదారుల వివరాలతో నివేదికలు ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్ల పరిశీలన తర్వాత 23 జిల్లాల్లోనే భూమి అందుబాటులో ఉన్నట్లు తేలింది. వైఎస్సార్, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఆశాజనకంగా భూమి అందుబాటులో ఉండగా, మరో 8 జిల్లాల్లో వెయ్యి నుంచి 4 వేల ఎకరాల లోపు భూమి లభ్యత ఉన్నట్లు నిర్ధారణ అయింది. మరో 9 జిల్లాల్లో వెయ్యి నుంచి 2 వేల ఎకరాల భూమి ఉండగా, 4 జిల్లాల్లో వెయ్యి ఎకరాల లోపు భూమి అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్లు నివేదికలు ఇచ్చారు. విశాఖ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో భూమి అందుబాటులో లేదు. త్వరలో మంత్రివర్గం భూ పంపిణీకి ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో చివరిసారిగా 2013లో భూ పంపిణీ జరిగింది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా | జస్టిస్ భూయాన్, జస్టిస్ ఎస్‌వీ భట్టి

▶ మొదటి పేజీ తరువాయి

సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టులో మూడు న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయాల్సి ఉండడంతో కొలీజియం ఇటీవల సమావేశమైంది. కేరళ సీజే ఎస్.వెంకటనారాయణ భట్టి, తెలంగాణ సీజే జస్టిస్ ఉజ్జల్ భుయాన్ పేర్లను కొలీజియం ఏకగ్రీవంగా సిఫార్సు చేసినట్లు సుప్రీంకోర్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తులుగా సీనియారిటీ, మెరిట్, పనితీరు వంటి అంశాలతోపాటు హైకోర్టుల ప్రాతినిధ్యం, అట్టడుగు వర్గాలు, సమాజంలో వెనకబడిన వర్గాలు, లింగ వైవిధ్యం, మైనారిటీల ప్రాతినిధ్యం వంటివి మూల్యాంకనం చేసి ఈ ఇద్దరు న్యాయమూర్తులను సిఫార్సు చేసినట్లు పేర్కొంది. 2022 ఆగస్టు నుంచి సుప్రీంకోర్టులో ఏపీకి ప్రాతినిధ్యం లేదు. ఈ నేపథ్యంలో మాతృ హైకోర్టు అయిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రస్తుత న్యాయమూర్తుల్లో సీనియర్ అయిన జస్టిస్ భట్టిని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది.

సమగ్రత, సామర్థ్యం ఉన్న జస్టిస్ భుయాన్

తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ ఉజ్జల్ భుయాన్ చట్టంలోని విభిన్న అంశాలపై అనుభవం సంపాదించారని సుప్రీంకోర్టు కొలీజియం పేర్కొంది. లా ఆఫ్ టాక్సేషన్‌లో ఆయన ఎంతో నైపుణ్యం ఉన్నవారని తెలిపింది. బొంబాయి హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన సమయంలో ట్యాక్సేషన్ సహా పలు కేసులు సమర్థంగా డీల్ చేసిన ఆయన సమగ్రత, సామర్థ్యం ఉన్న న్యాయమూర్తి అని పేర్కొంది. జస్టిస్ భుయాన్ 2011 అక్టోబరు 17న గౌహతి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

జస్టిస్ భట్టి అనుభవం అపారం

ఏపీ, కేరళ హైకోర్టుల్లో సుదీర్ఘకాలం పనిచేసిన జస్టిస్ భట్టి చట్టంలోని పలు అంశాలపై అపార అనుభవం సంపాదించారని సుప్రీంకోర్టు కొలీజియం పేర్కొంది. జస్టిస్ భట్టి తీర్పులే ఆయన న్యాయపరమైన యోగ్యతకు నిదర్శనమని తెలిపింది. జస్టిస్ భట్టి జ్ఞానం, అనుభవం సుప్రీంకోర్టుకు అదనపు విలువ అందిస్తాయని పేర్కొంది. జస్టిస్ ఎస్.వి.భట్టి 1962 మే 6న చిత్తూరు జిల్లా మదనపల్లెలో జన్మించారు. తల్లిదండ్రులు రామకృష్ణయ్య, అన్నపూర్ణమ్మ. మదనపల్లెలోని గిరిరావు థియోసోఫికల్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఆయన బీసెంట్ థియోసాఫికల్ కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. బెంగళూరులోని జగద్గురు రేణుకాచార్య కాలేజీ నుంచి లా డిగ్రీ పొంది, 1987లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఇ.కళ్యాణ్‌రామ్ వద్ద న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, బీహెచ్ఈఎల్, బీఈఎల్, బీహెచ్‌పీవీ, ఆర్ఎస్‌వీపీ, నేషనల్ మారిటైం యూనివర్సిటీలకు న్యాయవాదిగా వ్యవహరించారు. 2000 నుంచి 2003 వరకు ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదిగా అప్పటి అడ్వొకేట్ జనరల్‌కు సహాయ సహకారాలు అందించారు. 2013 ఏప్రిల్ 12న అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2014లో ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. హైకోర్టు విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా 2019లో ప్రమాణం చేశారు. అదే ఏడాది జస్టిస్ భట్టిని కేరళ హైకోర్టుకు బదిలీ చేస్తూ అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్, న్యాయమూర్తులు జస్టిస్ సిక్రీ, జస్టిస్ బాబ్డే, జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ అరుణమిశ్రాలతో కూడిన కొలీజియం నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్న ఆయన ఈ ఏడాది ఏప్రిల్ 24న కేరళ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా, జూన్ 1న పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

సీఐడీ విచారణకు రామోజీ, శైలజా కిరణ్ డుమ్మా

సాక్షి, అమరావతి/నగరంపాలెం (గుంటూరు వెస్ట్): మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ప్రధాన నిందితుడు చెరుకూరి రామోజీరావు, ఏ–2 శైలజాకిరణ్ బుధవారం సీఐడీ విచారణకు డుమ్మా కొట్టారు. కాగా.. ఈ కేసులో ఏ–3గా ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ 7 బ్రాంచ్ కార్యాలయాల మేనేజర్లు గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. చందా దారుల నిధులను మళ్లించామని, ఇదంతా తమ ప్రధాన కార్యాలయం ఆదేశాలతోనే చేశామని వారు సీఐడీ విచారణలో వెల్లడించినట్టు సమాచారం. తమ సంస్థలో చాలా ఏళ్లుగా చేస్తున్నట్టుగానే తాము కూడా చేశామని.. అందులో తాము కేవలం పాత్ర ధారులమేననని.. పూర్తి నిర్ణయాధికారం తమ ప్రధాన కార్యాలయానిదేనని స్పష్టం చేసినట్టు సమాచారం.

జిల్లా వార్తలు

సాయిబాబా ఆలయానికి భారీ విరాళం



ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న దాతలు

భద్రాచలంటౌన్: భద్రాచలం జూనియర్ కళాశాల సెంటర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయానికి ఓ భక్తుడు బుధవారం భారీ విరాళం అందజేశాడు. ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడిన పట్టణానికి చెందిన వడ్లమూడి సింధు – వినయ్‌కుమార్ దంపతులు వారి కుటుంబ సభ్యులు అబ్బినేని రామచంద్రావు, పొట్లూరి వెంకటేశ్వర ప్రసాద్ జ్ఞాపకార్థం రూ.3.21 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈమేరకు సాయిబాబాను దర్శించుకున్న వారు ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తికి విరాళం అందజేయగా సన్మానించారు.

పెదవాగు ప్రాజెక్ట్‌లో ప్రవాహ నమోదు పరికరాలు



ప్రాజెక్ట్ వాటర్ సంప్‌పై అమర్చిన పరికరాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్ద ఉన్న పెదవాగు ప్రాజెక్ట్‌లో వరద నీటి ప్రవాహాన్ని నమోదు చేసేందుకు బుధవారం పరికరాలు బిగించారు. వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల వాగుల ద్వారా ప్రాజెక్ట్‌లోకి ఎంత మేర వరద నీరు వస్తోందో గుర్తించేందుకు గాను ఆటోమెటిక్ వాటర్ లెవల్ రికార్డర్, ఈ దృశ్యాలను రికార్డు చేసేందుకు సీసీ కెమెరాలను అమర్చారు. వీటి ద్వారా అందే సమాచారంతో దిగువ ప్రాంతాల్లో ప్రమాదాలను నివారణకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఇలాంటి పరికరాలను గత నెలలో అశ్వారావుపేట మండలం కుడుములపాడు వాగు వద్ద కూడా ఏర్పాటుచేసిన విషయం విదితమే.

సమ్మెబాటలో పంచాయతీ కార్మికులు

- నేటి నుంచి గ్రామాల్లో విధులు బహిష్కరణ
- సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఆందోళనలు
- ఉమ్మడి జిల్లాలో 3,932 మంది సిబ్బంది
- సమ్మెతో పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర పనులపై ప్రభావం చూపే అవకాశం



విధుల్లో నిమగ్నమైన పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్)

చుంచుపల్లి/ఇల్లెందు రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు ఇతర విధులు నిర్వర్తించే పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు సిద్ధమయ్యారు. ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించడమే కాక కనీస వేతనాలు అమలుచేయాలని, అర్హులకు ఉద్యోగోన్నతి కల్పించాలనే తదితర డిమాండ్లతో గురువారం నుంచి వారు సమ్మెకు దిగనున్నారు. పలుమార్లు అటు ప్రభుత్వం, ఇటు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేక సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని వారు చెబుతున్నారు. కాగా, పంచాయతీ కార్మికుల సమ్మెకు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూ, బీఆర్ఎస్‌కేవీ, టీజీకేబీయూ వంటి కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి.

కీలకమైన పనుల్లో...

ఖమ్మం జిల్లాలో 549 జీపీలకు గాను 2,280 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 481 గ్రామపంచాయతీలకు గాను 1,652 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. పెద్ద జీపీల్లో పది నుంచి 15 మంది, చిన్న జీపీల్లోనైతే నలుగురు నుంచి ఆరుగురు చొప్పున విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిని మల్టీపర్పస్ వర్కర్లుగా పిలుస్తుండగా, చెత్తాచెదారం తొలగింపు, డ్రెయినేజీల నిర్వహణ, హరితహారం మొక్కలు, ప్రభుత్వ పాఠశాల పరిశుభ్రత, ఇంటింటికి చెత్త సేకరణ, విద్యుద్దీపాలు, తాగునీటి సరఫరా, ఇంటి పన్నులు వసూలు వంటి విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ప్రభుత్వం రూ.9,500 చొప్పున, మేజర్ పంచాయతీల్లో రూ.12 వేల చొప్పున చెల్లిస్తున్నారు. కాగా, ఉదయం నుంచి రాత్రి వరకు పని భారంతో సమతమతమవుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. ఇక ట్రాక్టర్ల డ్రైవర్లుగా కూడా తమతోనే పని చేయిస్తుండడం, విద్యుత్ లైట్ల మరమ్మతు పనులతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. అయితే, కనీస వేతనం అమలుచేయడంతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి గురువారం నుంచి సమ్మెకు దిగుతుండగా... పనులు స్తంభించే అవకాశముందని తెలుస్తోంది. కానీ అధికారులు మాత్రం సమ్మె ప్రభావం పడకుండా ప్రత్యామ్నాయ చర్యలకు దిగుతున్నట్లు తెలిసింది.

17 డిమాండ్లతో సమ్మె నోటీసు

గ్రామపంచాయతీల సిబ్బంది జేఏసీగా ఏర్పడి ఉద్యమానికి తెరతీశాయి. ప్రధానంగా 17 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశాయి. గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని, పీఆర్‌సీలో నిర్ణయించిన బేసిక్ ప్రకారం రూ.19వేలు వేతనంగా చెల్లించాలని, ఆలోపు జీఓ నెం.60లో పేర్కొన్న వేతనాలను కేటగిరీల వారీగా అమలుచేయాలని కోరుతున్నారు. అలాగే, కారోబార్, బిల్ కలెక్టర్లకు అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే కేటగిరీలను యథావిధిగా కొనసాగించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె



ప్రజాసేవలో నిమగ్నమవుతున్న మమ్ముల్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అనేక సార్లు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. దీంతో సమ్మె ద్వారానే సమస్యలు సాధించుకోవాలని నిర్ణయించాం. రోజువారీగా నిరసనలతో సమ్మె కొనసాగిస్తాం.

– దుంపల అమర్‌నాథ్, జీపీ వర్కర్ల జేఏసీ జిల్లా కోకన్వీనర్

అర్హులందరికీ పదోన్నతి కల్పించాలి



ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రామపంచాయతీల్లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న వర్కర్లకు కార్యదర్శులుగా పదోన్నతి కల్పించాలి. గుమస్తాలు, బిల్ కలెక్టర్లకు అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శిగా గుర్తింపు ఇవ్వాలి. అలాగే, కనీస వేతనాలు చెల్లించాలి.

– తొగర సామేలు, జేఏసీ కన్వీనర్, ఇల్లెందు మండలం

స్పందించకపోవడంతోనే సమ్మె



కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఇప్పటికే పలుమార్లు ఆందోళనలు చేసి ప్రభుత్వానికి విన్నవించాం. అలాగే, ఉన్నతాధికారులకు కూడా కలిశాం. అయినా స్పందన లేకపోవడంతోనే సమ్మెకు దిగాల్సి వస్తుంది. ఇకనైనా ప్రభుత్వం మా సమస్యలను పట్టించుకోవాలి.

– జటంగి వెంకన్న, జీపీ వర్కర్ల జేఏసీ జిల్లా కోకన్వీనర్

రెండు రాష్ట్రాల స్థాయి పురోహితుల క్రికెట్ టోర్నీ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రదీప్‌కుమార్, నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని స్తంభాద్రి పురోహితుల సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్థాయి పురోహితుల క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలను డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, బ్రాహ్మణ సంఘం నాయకులు వనం కృష్ణవేణి, సీతారామశాస్త్రి, శ్రీధర్‌శర్మ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం పూజల్లో నిమగ్నమయ్యే పురోహితుల కోసం పోటీలు ఏర్పాటుచేయడం మంచి పరిణామమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.డీ.మతిన్, ఓలేటి సాంబమూర్తితో పాటు నిర్వాహకులు సంతోష్‌శర్మ, సాయినాథ్‌శర్మ, ప్రశాంత్‌శర్మ, దిలీప్‌శర్మ, అనిరుధ్‌శర్మ, శ్రీధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మోపిదేవి విజయవాడ – అఘశాయ జట్ల నడుమ జరిగిన మ్యాచ్‌లో అఘశాయ జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. కాగా, టోర్నీలకు 16 జట్లు హాజరుకాగా, ఈనెల 10వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు వెల్లడించారు.

తక్కువ వడ్డీరేటుతో గృహరుణాలు

బిల్డర్ల సదస్సులో ఏపీజీవీబీ చైర్మన్ ప్రతాపరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న ఏపీజీవీబీ చైర్మన్ ప్రతాపరెడ్డి, పాల్గొన్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: మిగతా సంస్థలతో పోలిస్తే తాము అతి తక్కువ వడ్డీ రేట్లతో గృహ రుణాలు అందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు(ఏపీజీవీబీ) చైర్మన్ కె.ప్రతాపరెడ్డి వెల్లడించారు. ఖమ్మంలోని ఏపీజీవీబీ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం బిల్డర్స్ మీట్ జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ గత నెల 20 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు రుణమేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమయంలో గృహ రుణాలు తీసుకున్న వారికి ప్రాసెసింగ్ ఫీజు ఉండకపోగా, వడ్డీ రేటు కూడా కూడా అత్యల్పంగా 8.35 శాతంగానే నిర్ణయించామని చెప్పారు. మహిళలకు ప్రత్యేకంగా మరో 0.05 శాతం తగ్గింపు ఉంటుందని చెప్పారు. అనంతరం వ్యవసాయ రుణాలపై జిల్లా వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యాన శాఖ అధికారులతో పాటు లీడ్ బ్యాంకు మేనేజర్‌తో సమావేశమై ప్రణాళిక రూపొందించారు. ఏపీజీవీబీ ఖమ్మం రీజనల్ మేనేజర్ విజయ్‌భాస్కర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో బ్యాంకు చీఫ్ మేనేజర్ దేవేందర్, అడ్మిన్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ సేవల్లో ప్రతిభ కనబర్చిన మేనేజర్లను చైర్మన్ సత్కరించారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్ డీఎస్పీ మోహన్

మహబూబాబాద్ రూరల్: రెండు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన నిందితుడిని మహబూబాబాద్ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈమేరకు నిందితుడితో పాటు సొత్తు భద్రపర్చిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని రూ.5.30 లక్షల విలువైన 7.50 తులాల బంగారం, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో సీసీఎస్ డీఎస్పీ గంద్రతి మోహన్ వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ నెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన కొట్ల ముత్యాలరావు ఎనిమిదేళ్లుగా భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, మహబూబాబాద్ ప్రాంతాల్లో 20 వరకు చోరీలు చేసి పోలీసులకు పట్టుబడి పలుమార్లు జైలుకు వెళ్లాడు. రాత్రి సమయంలో తలుపులు తెరిచి నిద్రిస్తున్న వారి ఇళ్లలో చోరీలు చేసే ఆయన బెయిల్‌పై బయటకు వచ్చాక గత జనవరిలో మహబూబాబాద్‌లో మూడు చోరీలు చేశాడు. ఆ సొత్తును భద్రాచలం శిల్పినగర్ కాలనీకి చెందిన వట్టికూటి వెంకటేష్ వద్ద భద్రపరిచాడు. ఈక్రమంలో సొత్తును విక్రయించేందుకు చోరీ చేసిన బైక్‌పైనే మహబూబాబాద్‌కు బుధవారం వచ్చిన వారు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా విచారించగా చోరీలు చేసినట్లు ఒప్పుకోవడంతో సుమారు రూ.5.30 లక్షల విలువైన 7.50 తులాల బంగారం, బైక్ స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితులపై పీడీ యాక్టు నమోదు చేస్తామని డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్, టౌన్ ఇన్‌స్పెక్టర్లు ఈ.భీమేశ్, వై.సతీశ్, ఎస్‌ఐ బీ.సతీశ్, సిబ్బంది శంకర్, ఉపేందర్‌రావు, ఉమామహేశ్వర్, రహమత్ అలీ, పాపయ్య, బాలు, విజయ్ కుమార్, సుధాకర్, రాజేశ్‌ను ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

మూడు గనుల్లో డిసెంబర్ నుండి బొగ్గు ఉత్పత్తి



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని వీకే ఓసీ, రొంపేడు ఓసీ, గొల్లేటి ఓపెన్‌కాస్ట్‌ల్లో ఈ ఏడాది డిసెంబర్ నుంచి బొగ్గు ఉత్పత్తి మొదలుపెట్టేలా అనుమతులు సాధించాలని సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశించారు. హైదరాబాద్‌లో బుధవారం ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఆయాగనులకు సంబంధించి అటవీ అనుమతులు త్వరగా తీసుకుని ఉత్పత్తి ప్రారంభించాలని తెలిపారు. కాగా, కొత్తగూడెం ఏరియాలోని వీకే ఓసీలో ఉత్పత్తి లక్ష్యం 43 లక్షల టన్నులు కాగా ఈ ఏడాది కనీసం 7 లక్షల టన్నులు, ఇల్లెందు ఏరియాలోని రొంపేడు(జేకే) ఓసీలో వార్షిక లక్ష్యం 20 లక్షల టన్నులకు ఈ ఏడాదికి రూ.3 లక్షల టన్నులు ఉత్పత్తి సాధించాలని చెప్పారు. అలాగే, ఒడిశాలోని నైనీ బ్లాక్‌పై సమీక్షించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు ఎన్.బలరామ్, ఎన్వీకే.శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వరరెడ్డి, జీఎంలు పాల్గొన్నారు.